సుఖం తనను కూడా ఆకర్షిస్తే!

"జై భగవాన్ జై!"

వాన కురిసి కురిసి, దానంతట అదే వెలిసింది. ఆకాశముమీద నక్షత్రాలు పొడచూపాయి.

చప్పుడుకాకుండా వీధితలుపుతీసి, తెల్లవారటానికి యింకా జాముప్నర ప్రొద్దువున్నప్పటికీ, చెప్పకుండా వెళ్ళిపోయాడు బైరాగి.

తెల్లవారిన తరవాత, ఇంట్లో సామాను లేవీ పోలేదని చూసుకున్నాక "దేవుడే అలా వచ్చాడేమో!" అంది రమణమ్మ.

---

# 7. ప్రేమ

అర్థరాత్రి సరిగ్గా పన్నెండు గంటలవేళ. వీధి తలుపు చప్పుడయింది. ఇంట్లో ఉన్నవారు ఒక్కొక్కరే "ఎవరు వారూ?" అని కేక వేశారు. ఆ ప్రశ్నకు సమాధానం రాలేదు. తలుపు చప్పుడు మాత్రం అవుతూనే ఉన్నది. లేచి వెళ్ళి తలుపు తియ్యడానికి ఎవరికి వారికే బద్ధకంగా ఉంది. ఎవరూ లేవలేదు. చప్పుడు—మెల్లగా—అవుతునే వున్నది.

"ఎవరంటే మాట్లాడరేమిటమ్మా? అమ్మాయీ కనకం, వెళ్లి తలుపు తియ్యి. మీ బాబాయి అయివుంటాడు. ఆయనకు యిదే దురలవాటు. ఎంత పిలిచినా పలకడు" అని వసారాలో మూలగా పడుకున్న ముసలమ్మ సణిగింది.

"వస్తున్నా ఉండండి, ఎవరో" అని కనకం—కళ్ళు నులుముకుంటూ నడవ గదిలోనుంచి వసారాలోకి వస్తూ అంది. ఆ జవాబుతో తలుపు చప్పుడు ఆగింది.

అగ్గిపెట్టెకోసం, రాత్రి యెప్పుడో ఆర్పి, ఎక్కడో పెట్టిన లాంతరు కోసం వెతుక్కొని, లాంతరు వెలిగించుకొని, కనకం తలుపు

తియ్యడానికి వచ్చేటప్పటికి, అర్ధరాత్రివేళ నిద్రాభంగం పొందిన ఆ యింటిలోని ఇద్దరు ముగ్గురికి మళ్ళీ నిద్ర గాఢంగా పట్టింది.

పాపం! ఆ వచ్చినవా రెవరికో తలుపు తీసే అవస్థ కనకానికి మాత్రం తప్పలేదు. భర్త విడిచిపెట్టిన పడతి ఎవరైతేనైనా, పుట్టింటో మాత్రం లోకువ బ్రతుకు కాదూ!

కనకం మనసులో ఏమైనా అనుకున్నదో, లేక యిలాటి ఘర్మా యింపులకు ఆమె అలవాటుపడిందో కాని వెళ్ళి తలుపు తీసింది.

తలుపు తియ్యడమంటే ఏమిటి? బార్లా కాదు. ఒక్క రెక్క సగం తీసిందో లేదో "నువ్వా!" అంటూ నిర్ఘాంతపడి, అలా నిలుచుండి పోయింది. వీధిలోవున్న వ్యక్తిమీద, కనకంచేతిలోవున్న లాంతరు వెలుతురు ఒక్కమాటు మాత్రమే పడింది. ఆ వెలుతురులో, తలమీద నీలిరంగు కోకకొంగు ముసుగు వేసుకున్న ఒక చక్కని పాతికేళ్ళ స్త్రీ కనకానికి స్పష్టంగా కనిపించింది.

ఆ స్త్రీని చూడగానే కనకం ఎందుకో విపరీతంగా భయపడింది. త్రాచుపామును చూసిన వ్యక్తి, వెనక్కు వెనక్కు ఎలా జరిగిపోతాడో, అలాగ తలుపు వెనకకు జరిగిపోయింది.

"చూడు, కనకం-నేను నిన్ను ఏమీ చెయ్యడానికి రాలేదు" అని, దీనమైన సన్నని కంఠంతో, ఆ వచ్చిన స్త్రీ అన్నదాకా, కనకం అలా బ్రమ్మపడి, తలుపును కవచంగా పెట్టుకొని నిలుచునే వున్నది. ఆ స్త్రీ మాట్లాడిన తరవాత కనకానికి కొంచెం ధైర్యం వచ్చింది.

"నువ్వెందు కొచ్చావు యిక్కడికి?" అని ప్రశ్నించింది.

"నీతో మాట్లాడడానికి" అని ఆ స్త్రీ జవాబు.

"నాతో మాట్లాడవలసింది నీకూ, నీతోటి మాట్లాడవలసింది నాకూ ఏమీలేదు. అర్ధరాత్రి ఇలా వచ్చి తలుపు కొట్టడంలో నీ వుద్దేశం ఏమిటి?" అని కొంచెం రోషంతో రెట్టించింది కనకం.

"కనకం—ఎందు కలా కోపగిస్తావ్? నీతోటి మాట్లాడా లని వచ్చాను. రెండే మాటలు—చూడు ఎవరైనా వింటారేమో, ఇలా వీధి అరుగుమీదకు రా. లేదా, నీ పడకగదిలోకి నేను వస్తాను పద. బయట చాలా చలిగా వుంది" అని మరింత దీనంగా ప్రార్థించింది ఆ వ్యక్తి.

కనకానికి ఏమీ తోచలేదు. ఆ వచ్చిన మనిషి కోరికతీర్చకుండా, తలుపు ఛడేల్మని బిగించి లోపలికి వెళ్ళడానికి కనకానికి మనసు వొప్ప లేదు.

"సరే. లోపలికి రా" అని తాను ప్రక్కకు వొదిగి, ఆ మనిషి లోపలకు రాగానే తలుపు మూసి, లాంతరు కొంచెం తగ్గించి, ఆ వ్యక్తిని తన గదిలోకి తీసుకొని వెళ్ళింది. వీళ్ళిద్దరూ లోపలికి వెడుతూ ఉండగా "ఎవరే, ఆ వచ్చిందీ?" అని ముసలమ్మ అడిగింది గాని, "ఎవరూ లేదు. గడియ సరిగ్గా వెయ్యక గాలికి తలుపు కొట్టుకుందిలే" అని కనకం చెప్పిన జవాబుతో ఏదో సణుక్కుంటూ ముసలమ్మ మళ్ళీ గుర్రులో పడింది.

కనకం, ఆ వచ్చిన మనిషిని తన గదిలోకి తీసుకు వెళ్ళి, లాంతరు పెద్దదిచేసి, ఆపాదమస్తకమూ, ఆ వ్యక్తిని పరీక్షించింది.

"చాలా చిక్కిపోయావ్?" అని ప్రశ్నించింది.

"అవును, చాలా పెద్ద జబ్బు చేసింది" అని, ఆ స్త్రీ అతి జాలిగా, కనకంవైపు చూసింది. ఆమెపట్ల యెంతో కర్కశత్వాన్ని చూపుదామనుకున్నా, కనకానికి చేతకావడం లేదు. నిజానికి శత్రుత్వం చూపాలంటే, ఆ వ్యక్తికంటే వేరే శత్రువు లెవరూ కనకానికి లేరు. తన భర్తను తనకు కాకుండా చేసింది ఆ మనిషే!

"చూడు కనకం—నువ్వు అర్జంటుగా ఆయన దగ్గరకు వెళ్లాలి. ఇప్పుడు నువ్వు ఆయనకు చాలా అవసరం" అంది ఆ వ్యక్తి.

"ఏం, ఆయనకు జబ్బుగా ఉందా?" అని అమితమైన ఆదుర్దాతో అడిగింది కనకం.

"జబ్బా లేదు, ఏమీ లేదు. ఒకప్పుడు నువ్వు నన్ను నీ భర్తను నీకు యిమ్మని అడిగావ్. అప్పుడు అది నా చేతిలో పని కా దన్నాను. కేవలం అశక్తతవల్ల సుమా! ఆయన నన్ను యెంతో ఎక్కువగా ప్రేమించారు. నేనూ ఆయన్ను అలాగే ప్రేమించాను. నువ్వు ఆయన్ని ప్రేమించడం లేదని నేనను సుమా. మనిద్దరం ఆయన్ని ప్రేమించాము. ఆయన మాత్రం మనిద్దరిలో ఒకర్ని ఎక్కువగా ప్రేమించారు. నిన్ను సరిగా ప్రేమించలేదు. అందుకు నేను సంతో

షించడంలేదు సుమా. నువ్వు ఆయన సుఖాన్ని ఎలా కోరావో, నేనూ ఆయన సుఖాన్ని అలాగే కోరాను. ఆయన లోపం నువ్వు క్షమించు. వెంటనే ఆయన దగ్గరకు వెళ్లు" అని కనకం గడ్డం పట్టుకుని బుజ్జగించింది ఆమె.

కనకానికి ఇదంతా అయోమయంగా వుంది. ఇప్పు డిది ఇంకొకడితో ఎవడితోనైనా లేచిపోతోందా! అలా ఐతే, తన భర్త ఏమయితే దాని కెందుకు- ఇలా వచ్చి తనను ప్రాధేయపడడం జరుగుతుందా! కాదు. ఏమి టబ్బా!

"చూడు, నా కేమీ అర్థంకావడం లేదు" అంది కనకం.

"ఏముంది దీంట్లో? నువ్వు అసలు అర్థంచేసుకోడానికి ప్రయత్నించకు. నా సంగతీ అదీ మరిచిపో; తెల్లవారగానే బయలుదేరి ఆయన దగ్గరకు వెళ్లు. ఆయన సుఖం నీ సుఖంగా చూచుకుంటావు కదూ! ఇంక నన్ను వెళ్ళనీ. దా, తలుపు వేసుకుందువుగాని——" అని లేచింది ఆ స్త్రీ.

తనను మించిన ఏదో ఒక శక్తికి లోబడిపోయినట్లుగా కనకం కూడా లేచింది. ఇద్దరూ తలుపు తీసుకొని వీధిలోకి వచ్చారు.

"కనకం——నా మీద యిక యెప్పుడూ కోపంగా ఉండకేం, ఏం? ఏదీ, ఒక్కసారి నన్ను కౌగిలించుకోనియ్యి"అని ఆ స్త్రీ, కనకాన్ని అత్యంత తమకంతో కౌగిలించుకుంది.

"ఇంత అర్ధరాత్రి ఎక్కడికి వెడతావు? రేపు వెడుదువుగానిలే. రా. లోపల పడుకుందాం" అని కనకం అంటున్నా వినిపించుకోకుండా, కనకం సిగ్గుపడుతూన్నా లక్ష్యపెట్టకుండా ఆమె రెండు చెక్కిళ్ళనూ గట్టిగా ముద్దుపెట్టుకొని ఆ స్త్రీ గబగబా మెట్లుదిగి వీధిలోని చీకట్లోకి నడిచిపోయింది.

దిగ్భ్రమతో కొంతసేపు అక్కడే నిలుచునీ, చాలాసేపు మంచం మీద కూర్చుని ఆలోచించీ, నిద్రపట్టక అటు యిటూ మసులుతూ, కనకం ఆ రాత్రి శేషాన్ని ఎలాగో గడిపింది.

తెల్లవారిందో లేదో, నాయనమ్మమాట లక్ష్యపెట్టక, అమ్మతో పోట్లాడి, తన సామాను సర్దుకొని బండి యెక్కి,తన భర్త కాపురమున్న

పేటకు అరగంటలో వెళ్ళి, భర్తవున్న యింటి తలుపు కొట్టింది. లోపల్నుంచి "తలుపు తీసేవుంది" అని కేక వినపడగానే, గబగబా లోపలికి వెళ్ళింది.

వసారాలో చాపమీద శవం—ఆ శవం ప్రక్కనే, తలవంచుకొని దుఃఖిస్తూ తన భర్తా—మండువా దగ్గర దిగాలుపడి కూచుని బంట్రోతూ కనపడ్డారు.

భర్త తలయెత్తి తనవంక చూసి, "నువ్వా!" అని వ్రేలితో శవాన్ని చూపించాడు.

ఆ శవం ఎవరో అని కనకం దగ్గరకు వెళ్ళింది.

నిన్నరాత్రి తన దగ్గరకు వచ్చినప్పుడు ఎలా వుందో అలాగే వుంది. విషం తాగింది కాబోసు!

"అయ్యో! ఇంతపని చేస్తుందనుకోలేదు. నిన్నరాత్రి పన్నెండింటికి వచ్చి, నన్ను వెంటనే మీ దగ్గరికి రమ్మని బ్రతిమాలింది!" అని కనకం అంటూండగానే, ఆమె భర్తలేచి "పన్నెండు గంటలకా! సరిగ్గా ఆ సమయానికే దాని ప్రాణాలు పోయాయి. సరిగ్గా పన్నెండింటికే!" అన్నాడు.

"నిజమే!" అంటూ విస్తుపోయింది కనకం. కాని రెండు నిమిషాలలో ఆమెకు ఏమర్థమయిందో; "ఎంత ప్రేమగలదానివే, లక్ష్మీ!" అంటూ ఆ శవాన్ని కౌగిలించుకొని విలపించింది.

———

# 8. వంట మనిషి పోలికలు

"మీరు నన్ను ఎందుకు పనిలోనుంచి తీసివేస్తున్నారో నాకు తెలుసు, అంతమాత్రం తెలియకపోలేదు లెండి" అని, సామానంతా సర్దుకొని ఇల్లు బయలుదేరి వెళ్ళిపోతూవున్న వంటలక్క అంది.